క్లుప్తంగా

అభివృద్ధికి నిధులు కేటాయించండి



కడా అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దుద్యాల్ : నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. శనివారం కడా అధికారి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుద్యాల మండలం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా.. ఇంతవరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కావునా, నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, బస్సు సౌకర్యం, బ్యాంకు సేవలు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డంతా బురదమయం



రోడ్డుపై నాట్లు వేస్తున్న కాలనీవాసులు

పరిగి: రోడ్డు బురదమయంగా మారి, ప్రజలు నడవడానికి ఇబ్బందిగా ఉండటంతో శనివారం ఆ రోడ్డుపై ప్రజలు వరినాట్లు వేస్తూ వినుత్నంగా నిరసన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలోని 5వ వార్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే కాలనీకి సీసీరోడ్డు లేక వర్షం పడిందంటే రోడ్డు మొత్తం చిత్తడిచిత్తడిగా మారి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆలయానికి వెళ్లే భక్తులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కాలనీవాసులు రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులకు విన్నవించారు. రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం అయినా పనులే ప్రారంభించలేదని విమర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలు వరినాట్లు వేస్తూ నిరసన తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి

బంట్వారం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. తల్లిపాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు లభిస్తాయని చెప్పారు. ముఖ్యంగా ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలు తాగిస్తే ఎంతో శ్రేయస్కరమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ టీచర్ పారిజాత, ఆశవర్కర్లు సుమిత్ర, శోభ పాల్గొన్నారు.

బడుల నిర్వహణ ఖర్చుల ఆడిటింగ్

బొంరాస్‌పేట: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో తాజా బడుల నిర్వహణ ఖర్చుల ఆడిటింగ్ కొనసాగుతోంది. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నివేదికలు తయారు చేసుకుంటున్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో నివేదికలు సమర్పిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని ఏనెమీదితండా, టేకులగడ్డతండా, బాపల్లితండా తదితర పాఠశాలల హెచ్‌ఎంలు నివేదికలు సమర్పించి ఆడిటింగ్ చేయించుకున్నారు.

రాగి జావతో ఆరోగ్యం

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్



రాగిజావ అందిస్తున్న రవీందర్‌గౌడ్

దుద్యాల్ : ఉదయం సమయంలో విద్యార్థులు రాగి జావా తాగడం వల్ల వారి మేధాశక్తి పెరుగుతుందని తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ అన్నారు. శనివారం దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాలు అధికంగా ఉన్న రాగి జావను తీసుకోవడంతో విద్యార్థులు ఆ రోగ్యం ఉంటారని అన్నారు. ఆయన కుమార్తె రిషిత పుట్టిన సందర్భంగా విద్యార్థులకు రాగిజావ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయరామారావు, ఉపాధ్యాయులు మల్లప్ప, విజయ్‌కుమార్, సుధాకర్‌రావు, అభయకుమార్, శ్రీనివాస్, రాములు, రవి, వహీద్, సాలి బాయ్, నవీన పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యపై ఆసక్తి

ఆశ్రమ పాఠశాలలో చేరికకు విద్యార్థినులు మొగ్గు చూపతున్నారు. నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయల కల్పనతో హాస్టళ్లపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు ఆశ్రమ పాఠశాలలలో చదివేందుకు ముందుకు వస్తుండటంతో విద్యార్థినిల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

- వసతిగృహాల్లో చదివేందుకు విద్యార్థుల ఉత్సాహం
- పెరుగుతున్న సంఖ్య
- విద్య, వసతి, మౌలికసదుపాయల కల్పనతో మొగ్గు



బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాల



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తుంటున్నారు. ఈ క్రమంలో తమ పిల్లలను స్థానికంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలో చేర్పి వెళ్తుంటారు. మరి కొంతమంది చదివించే స్తోమత లేక ఆశ్రమ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. వికారాబాద్ జిల్లాలో మారుమూల ప్రాంతమైన కుల్కచర్ల మండలంలో వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉండటంతో అందుకు అనుగుణంగా వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల సంఖ్య సైతం గణనీయంగా ఉన్నాయి.

మండలంలో 9 వసతిగృహాలు

మండలంలోని బండవెల్కిచర్ల పరిధిలో ఒక బాలుర గురుకుల పాఠశాల , ఇంటర్ కళాశాల, బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాల ఉంది. అలాగే, మండల కేంద్రంలో ఒక ఎస్టీ ఆశ్రమ పాఠశాల, ఒక బీసీ వసతిగృహం, ఒక కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ఉంది. ముజాహిద్‌పూర్ గ్రామ పరిధిలో ఒక ఎస్టీ వసతిగృహం, బీసీ వసతిగృహం ఉంది. రాంపూర్ గ్రామ పరిధిలో బాలికల ఆశ్రమ పాఠశాల ఉంది. వీటిలో 4 హాస్టళ్లు, 5 పూర్తిస్థాయిలో ఆశ్రమ విద్యను అందిస్తున్న పాఠశాలలు. వీటికి అదనంగా ప్రస్తుతం 9,10వ తరగతులకు మాడల్ స్కూల్‌లో సైతం విద్యార్థినిలకు వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఇందులో సుమారుగా 3వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బాలికల జనరల్ హాస్టల్ ఏర్పాటుకు విజ్ఞప్తి

వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు ఇంటర్మీడియట్, డిగ్రీ, బీపీఈడీ, వివిధ వృత్తి విద్యాకోర్సులు నేర్చుకునేందుకు వస్తున్న విద్యార్థినిలకు కామన్ హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. వలసలు వెళ్లి ఇక్కడ తమ పిల్లలను చదివించేవారికి బీసీ, ఇతర కులాలవారికి ప్రస్తుతం ఉన్న వసతిగృహాలలో ఆశించిన మేర సీట్లు లభ్యంకాని పరిస్థితి ఉంది. కావునా జనరల్ హాస్టల్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం



తమ పాఠశాలలో 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. విద్య, మౌలిక వసతుల విషయంలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– బాలవరలక్ష్మి, ప్రత్యేకాధికారి, బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాల

పేద విద్యార్థులకు ప్రాధాన్యం



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు, ముఖ్యంగా తల్లిదండ్రులు లేని వారికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ వారిని ఆశ్రమ పాఠశాలలో చదివేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ప్రస్తుతం 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నాం.

– దేవి, కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల, కుల్కచర్ల

చాలా సౌకర్యంగా ఉంది



దూర ప్రాంతంలో ఉన్న పాఠశాలకు వెళ్లి రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఆశ్రమపాఠశాలలో ఉండి చదువుకుంటున్నా.. ఇక్కడ చాలా బాగుంది. విద్యాబోధన చాలా చక్కగా బోధిస్తున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, చదువు చెప్పడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–పూజ, 9వ తరగతి, కేజీబీవీ విద్యార్థిని

నీటి శుద్ధీకరణపై అవగాహన

కొడంగల్ : నీటి శుద్ధీకరణపై మలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప మున్సిపల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు శనివారం అవగాహన కల్పించారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛత కార్యక్రమంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బలరాంనాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నీటి శుద్ధీకరణ విధానం, తాగునీటిని క్లోరోస్కోప్ ద్వారా పరీక్షించు విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో ఎలా క్లోరినేషన్ చేయాలో వివరించారు. అలాగే, ప్రస్తుతం వర్షాకాలం ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ, నీళ్ల విరేచనాలు, డయేరియా, ఇతర విషజ్వరాలు సోకకుండా ప్రజలకు జాగ్రత్తలు పాటించాలన్నారు.



మాట్లాడుతున్న యూనిట్ అధికారి పకీరప్ప

ధారూరు డీటీగా విజయేందర్



ధారూరు: ధారూరు డిప్యూటీ తహసీల్దార్‌గా జి. విజయేందర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న ఆయన ధారూరుకు బదిలీపై వచ్చారు.

ప్రత్యేక పూజలు

మర్పల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర మందిరం వద్ద భజన మండలి భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, భజన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భజన మండలి భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు

సీఈఓ. రాజమౌళి



పెద్దేముల్: రైతులకు తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దీర్ఘ కాలిక రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని సీఈ ఓ రాజమౌళి పేర్కొన్నారు. శనివారం సీఈఓ సాక్షితో మాట్లాడుతూ.. సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి సహకారంతో సంఘం లాభాల బాటల్లో కొనసాగుతుందన్నారు. గతంలో 135 మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.2కోట్ల 70లక్షలు అందచేయడం జరిగిందని, తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించడంతో సంఘం మళ్లీ ముందుకు వచ్చి, రూ.కోటి దీర్ఘకాలిక రుణాలు అర్హులైన రైతులకు ట్రాక్టర్, కోళ్ల ఫారం, గొర్రెలు, మేకలతో పాటు పలు లోన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. టాక్టర్, కోళ్ల ఫారానికి రైతులకు ఐదు ఎకరాలపై భూమి, గొర్రెలు, మేకలకు రెండు ఎకరాలు తగ్గకుండా ఉండాలన్నారు. అలాంటి రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా సంఘంలో మొత్తం 2260 మంది రైతులు ఉండగా, 886 మంది రైతులకు పంట రుణం రూ.7కోట్ల 80లక్షల ఇవ్వడం జరిగింది. రుణమాఫీ రూ.లక్షలోపు 241 మంది రైతులకు రూ.కోటి 54 లక్షలు, రూ.1.5 లక్షలోపు 36 మంది రైతులకు రూ.74లక్షలు మాఫీ కాగా ఆ దబ్బులను ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. డిసెంబర్ వరకు రుణమాఫీ అయిన రైతులు వడ్డీ చెల్లించి కొత్తరుణాలు తీసుకోవాలని సీఈఓ తెలియచేశారు.

సంక్షిప్త వార్తలు

◆ మర్పల్లి తహసీల్దార్‌గా మునీరొద్దీన్

మర్పల్లి: మర్పల్లి మండల తహసీల్దార్‌గా శనివారం మునీరొద్దీన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన యాలాల మండల తహసీల్దార్‌గా ఉన్నారు. మర్పల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన గణేష్ బదిలీపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం మునీరొద్దీన్ మాట్లాడుతూ.. కార్యాలయ సిబ్బందితో కలిసి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఉద్యోగస్తులు తప్పనిసరిగా సమయపాలన పాటించేలా చూస్తానన్నారు.

◆ ఉపాధ్యాయులకు సన్మానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఏడుగురు ఉపాధ్యాయులను గ్రామస్తులు సన్మానించారు. అలాగే, నూతనంగా పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వడ్డె శ్రీను, మాజీ సర్పంచులు రాములు, శేఖర్, మాజీ ఎంపీటీసీ శాంతు పాల్గొన్నారు.

◆ తహసీల్దార్ బదిలీ

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల తహసీల్దారు విజయ్‌కుమార్‌ను బంట్వారం మండలానికి బదిలీ చేశారు. దౌల్తాబాద్‌కు ఇంకా ఎవ్వరిని నియమించలేదు. అలాగే, డిప్యూటీ తహసీల్దారు శివకుమార్ కూడా బదిలీ అయ్యారు. సోమవారంలోగా పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

◆ విరాళాల సేకరణ

అనంతగిరి: కేరళ వరద బాధితులకు ఆర్థిక సహాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాల సేకరణ చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మైపాల్ తెలిపారు. ఈ మేరకు వికారాబాద్‌లోని పలువురు అధికారులు, ప్రజలు, వ్యాపార వాణిజ్య సముదాయాల్లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సుదర్శన్, శ్రీనునాయక్, అక్బర్, హరికృష్ణ, బాలరాజు ఉన్నారు.

◆ అర్హులు బీమా చేయించుకోవాలి

మోమిన్‌పేట: అర్హులైన ప్రతి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ స్వరూప పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నమోదు చేస్తున్న రైతుబీమా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూశాఖ నుంచి వ్యవసాయ శాఖకు అందిన జాబితా ప్రకారం అర్హులైన రైతుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించాలన్నారు.

◆ ఉచిత వైద్య క్యాంపులతో లబ్ధి

మర్పల్లి: ఉచిత వైద్య క్యాంపును పేదలు సద్వినియోగం చేసుకోవాలని మా శారద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మా శారద వైద్యులు 190 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఫీవర్, దగ్గు, కీళ్లనొప్పులు, గ్యాస్ ప్రాబ్లం, ఈసీజీ వంటి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ రాజశేఖర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధి కారిణి రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

అక్రమ కట్టడాలపై సీరియస్

- కూల్చివేతకు యత్నం
- అడ్డుకున్న యజమానులు..
- నెల సమయంలో తొలగించాలన్న అధికారులు



రైస్‌మిల్లు కూల్చివేతను అడ్డుకున్న యజమాని

దుద్యాల్ : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే ప్రసక్తి లేదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రం సమీపంలోని సర్వే నంబర్ 1090లో ప్రభుత్వ భూమి ఉంది. ఆ స్థలం పక్కనే సర్వే నంబర్ 1089లో ప్రైవేట్ భూమి కలదు. ఆ భూమి యజమాని గురురాఘవేంద్ర రైస్‌మిల్లును గత రెండు సంవత్సరాల క్రితం నిర్మించుకున్నారు. ఇందులో కొంతభాగం ప్రభుత్వ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అక్రమంగా రైస్‌మిల్లు నిర్మించారని వెంటనే తొలగించాలని యజమానికి పలుమార్లు అధికారులు నోటీసులు పంపారు. నోటీసులకు స్పందన లేకపోవడంతో శనివారం ఉదయం వికారాబాద్ డీపీఓ జయసుధా, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల్ తహసీల్దార్ దానయ్య, బొంరాస్‌పేట ఎస్ఐ రాహుఫ్, దోమ ఎస్ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో రైస్‌మిల్లు కూల్చివేతకు సిద్ధమయ్యారు. జేసీబీల సహాయంతో రైస్‌మిల్లును కూల్చుతుండగా యజమాని రవికుమార్, రాజేశ్‌కుమార్‌లు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో అధికారులు, యజమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. అన్ని అనుమతి పత్రాలు ఉన్నాయని యజమానులు అధికారులకు తెలపడంతో పత్రాలను పరిశీలించారు. రైస్‌మిల్ కొంతభాగం మాత్రమే ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు గుర్తించి యజమానులకు వివరించారు. వెంటనే ప్రభుత్వ భూమిలో ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆదేశించారు. నెల రోజుల లోపు నిర్మాణం తొలగించాలని చెప్పారు.

అన్ని అనుమతులు ఉన్నాయి..

అన్ని అనుమతులతో కట్టినట్లు గురురాఘవేంద్ర రైస్‌మిల్ యజమానులు రవికుమార్ పేర్కొన్నారు. దుద్యాల పంచాయతీ అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ కూడా కట్టినట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడితే అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. నిర్మాణం చేపట్టక ముందు చర్యలు తీసుకోవాలని, ఇలా చేస్తే చాలా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మందకృష్ణ కృషితోనే వర్గీకరణ



పరిగి: సంబరాల్లో నాయకులు

పరిగి: మంద కృష్ణమాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి లాజర్ అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల చిరకాల వాంఛను కేంద్ర ప్రభుత్వం తీర్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. దీంతో ఎస్సీలకు ఉద్యోగ, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమాలు సక్రమంగా అందుతాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంచంద్రయాదవ్, పెంటయ్యగుప్తా, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, పెంటయ్య, ఆనంద్,సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు న్యాయం



శ్రీనివాస్

కుల్కచర్ల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుకబాటుకులాల ప్రజలకు లబ్ధిచేకూరుస్తుందని మండల ఎమ్మార్పీఎస్ సంఘ ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎమార్పీఎస్ సంఘాన్ని ఏర్పాటుచేసి ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో అలుపెరగని పోరాటాన్ని నిర్వహించి, ఎట్టకేలకు ఫలితాన్ని పొందడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

ఆరోగ్య ప్రమాణాలు పాటించాలి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కార్మికులు

తాండూరు: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య భద్రత ప్రమాణాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహులుతో కలిసి శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తూ కౌన్సిల్‌లో ఆమోదం పొందడంపై ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌లను కార్మికులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యంతోనే సాధ్యమవుతోందన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా కార్మికులు పారిశుద్ధ్య పనులను మరింత మెరుగు పర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, కార్మికులు తదితరులున్నారు.

‘స్వచ్ఛదనం– పచ్చదనం’ జయప్రదం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



అనంతగిరి: మాట్లాడుతున్న చైర్‌పర్సన్



బంట్వారం: మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశంలో 41 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. ఈ మేరకు శనివారం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎజెండాలో సూచించిన 41 అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందన్నారు. ముఖ్యంగా వీధిదీపాల నిర్వహణ, వీధి కుక్కల బెడద, యూజీడీ తదితర విషయాలపై సభ్యులు చర్చించారన్నారు. కౌన్సిలర్ల వార్డుల్లో ఉన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే, ప్రభుత్వం రేపటి నుంచి చేపట్టబోయే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోరారు. ఏ రోజుకారోజు పనులు చేస్తూ 5 రోజుల్లో ఇచ్చిన నిర్దిష్ట అంశాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శంషాద్‌బేగం ,కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండండి

బంట్వారం: స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని స్పెషల్ ఆఫీసర్ కమలాకర్ రెడ్డి అన్నారు. శనివారం బంట్వారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 5 నుంచి 9 వ తేదీ వరకు 5 రోజుల పాటు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు గానూ స్థానిక నాయకులు, ఎస్‌హెచ్‌జీలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీల సమావేశంలో ప్రచార చిత్రాల ద్వారా వీధి కుక్కల బెడద, ఇంటి పరిసరాల్లో చెత్తను వేరు చేయడంపై వంటి కార్యకలాపాలపై చర్చించి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నాగరాజు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం పచ్చదనంపై స్పెషల్ ఆఫీసర్ అశోక్ మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 9 వరకు గ్రామాల్లో ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం స్వచ్ఛదనం..పచ్చదనంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మల్లేశం మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచాల్సి ఉందని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు, ఏఏ గ్రామ పంచాయతీల్లో ఎన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయో ఏపీఓ సురేష్ వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ నర్సింహులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నిర్దిష్ట లక్ష్యం చేరుకోవాలి

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని అందరి సహకారంతో వందశాతం విజయవంతం చేయాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. 5 రోజుల కార్యక్రమంలో యువత, స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, వార్డు నాయకులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, జయరాం, ఎంపీఓ విజయ్ కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. శనివారం అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఆయా ప్రభుత్వాశాఖలకు ఇచ్చిన లక్ష్యం మేరకు ప్రతి రోజు ఒక కార్యక్రమం తీసుకోవాలని సూచించారు. ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: గ్రామాల్లో 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5రోజుల పాటుగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు, ఎంపీఓ ఖరీం, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.